పూడిమడక తీరం.. కాలుష్య కాసారం..

- పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోని వైనం
- జంతు కళేబరాలతో దుర్గంధం
- అనారోగ్య సమస్యలతో మత్స్యకారులు
- అస్తవ్యస్తంగా డ్రైనేజ్ వ్యవస్థ


లైట్ హౌస్ పరిసర ప్రాంతంలో తీవ్ర దుర్గంధంతో నిండిపోయిన జంతు కళేబరాలు


పూడిమడక తీరం వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు

అచ్యుతాపురం రూరల్: ఉవ్వెత్తిన ఎగసిపడే అలలు.. ఎన్నో ప్రకృతి అందాలకు నెలవు.. సముద్ర స్నానాలకు అనువైన పూడిమడక తీరం.. కాలుష్య కాసారంగా మారుతోంది. పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందకపోగా, తీరం వెంబడి వ్యర్థాలతో నిండిపోయి దుర్గంధ భరితంగా మారింది. దాంతో ఈ ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇక్కడ ఎంతో ఇష్టంగా సముద్ర స్నానాలు చేసి దగ్గర్లో జగన్నాథస్వామిని దర్శించుకుని తీరంలో సంతోషంగా సమయాన్ని గడుపుతారు. ఇప్పుడు వారంతా విముఖత చూపుతున్నారు.

వీధి రోడ్లపై మురుగు

పూడిమడకలో ఎప్పటికప్పుడు వివిధ పరిశ్రమల సీఎస్ఆర్ నిధులతో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసినప్పటికీ పరిసరాల పరిశుభ్రత లేకపోవడంతో వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోవడంతో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తూ డెంగ్యూ, మలేరియా వంటి అనేక వ్యాధులకు కారకమవుతున్నాయి. డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దాంతో మురుగు పోవడానికి వీలు లేక కాలువలన్నీ నిండిపోయి వీధి దారంటా పొంగి పారుతున్నాయి.

పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఉపాధి..

పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానికులు ఉపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధే చెందే అవకాశాలు ఉన్నాయి. లైట్‌హౌస్ ప్రాంతం, సీతపాలెం వంటి అనేక ప్రదేశాల్లో పార్కులు ఏర్పాటు చేసి పర్యాటకంగా అభివృద్ధి చేయడం లేదు. ఇక్కడ సినిమా షూటింగ్‌లకు, వెడ్డింగ్ షూట్‌లకు అనువైన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపించి ప్రకృతి అందాలతో ఎంతోమంది మదిని దోచే పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.


పర్యాటకుల సముద్ర స్నానాలకు అనువైన పూడిమడక తీరం

జంతు కళేబరాలతో దుర్గంధం

అభివృద్ధికి ఆమడదూరంలో పూడిమడక మత్స్యకారులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఎక్కడ చూసినా వ్యర్థ కాలుష్యం ఎక్కువ కావడంతో అపరిశుభ్రత నెలకొంది. గత్యంతరం లేని పూడిమడక వాసులు దుర్వాసనలోనే దుర్భర జీవనం సాగిస్తున్నారు. పూడిమడక లైట్ హౌస్ పరిసర ప్రాంతాలైతే ఇక కాలుష్యానికి మారుపేరుగా మారాయి. జంతు కళేబరాలతో పరిసర ప్రాంతాలన్నీ దుర్గంధ భరితంగా మారాయి. ఇక్కడ వ్యర్థాలతో భారీ డంప్ ఏర్పడటంతో పర్యాటకులు అటువైపు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని అధికారులు పలుమార్లు పూడిమడక తీరంలో పర్యటించి అనుకూలమైన ప్రదేశాన్ని సైతం ఎంపిక చేశారు. అయినప్పటికీ ఆ దిశగా చర్యలు కానరావడం లేదు.

క్లుప్తంగా

పోషకాహారం శ్రేయస్కరం


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అన్నపూర్ణ

మునగపాక: కిశోర బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ కోరారు. మునగపాక అంగన్‌వాడీ–2లో శుక్రవారం కిశోర వికాసంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల వయస్సున్న బాలికల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారికి సరైన పోషకాహారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు హేమ, సరస్వతి, రేవతీ పద్మ, వీవోఏలు, గర్భిణులు, బాలింతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని తోటాడ శివారు గవర్ల అనకాపల్లిలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు.

ఇంట్లో జారి పడి వ్యక్తి మృతి


మరిణియ్య (ఫైల్)

నక్కపల్లి: చినతీనార్లలో శుక్రవారం తన ఇంటి పనులు చేసుకుంటున్న సిరిపల్లి మరిణియ్య(52) జారిపడి మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తన ఇంటి మరమ్మతులు చేయిస్తున్నాడు. ఇందులో భాగంగా బెంచిపై నుంచి పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ జారి కింద పడ్డాడు. తల వెనుక భాగంలో బలమైన గాయమై రక్తస్రావమయింది. కుటుంబ సభ్యులు అతడ్ని వెంటనే నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కుమార స్వామి తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ


పాఠశాలకు కంప్యూటర్ అందిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారం పాఠశాలకు అడ్డురోడ్డు శ్రీప్రజ్ఞా కళాశాల యాజమాన్యం కంప్యూటర్ వితరణగా అందించారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు వారికి ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు సులభతరంగా విద్యనందించేందుకు పాఠశాలలో సౌకర్యాలు అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గార ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం


యజ్ఞోపవీత ధారణ ఘట్టం చేస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలని వినతి

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డు కార్మికులకు బకాయిపడ్డ మూడు నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్షణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు.

విత్తనోత్పత్తిపై దృష్టి సారించాలి


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

పాయకరావుపేట: యాంత్రీకరణ పద్ధతులను పాటించి కూలి ఖర్చులు తగ్గించుకోవాలని శాస్త్రవేత్తలు, అధికారులు కోరారు. వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా మండలంలో శ్రీరాంపురం, కేశవరం గ్రామాల్లో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ కొబ్బరిలో విత్తనోత్పత్తి, విత్తన ఎంపిక, భూసార పరిరక్షణకు అంతర పంటల యాజమాన్యం గురించి వివరించారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బండి నాగేంద్ర ప్రసాద్, డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా భూసార సంరక్షణ, నేల ఆరోగ్య పరిరక్షణ గురించి, కొబ్బరి, వరి పంటలలో ముందస్తు సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కొబ్బరిలో తట్టుకాయల నివారణ, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. ఏవో పి.ఆదినారాయణ మాట్లాడుతూ పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వీరబాబు, నాగశరత్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జోగారావు తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం


చెరువును తలపిస్తున్న కోటవురట్ల మెయిన్‌రోడ్డు


పెదగమ్ములూరు శివాలయం వద్ద రోడ్డుపై వర్షపునీరు

కోటవురట్ల: మండలంలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన ఏకధాటి వర్షానికి రహదారులు చెరువులా మారిపోయాయి. పొలాలలోకి భారీగా వర్షం నీరు చేరింది. కోటవురట్ల ప్రధాన కూడలిలోని తుపాకుల గెడ్డలో చాలా కాలానికి నీటి ప్రవాహం కనిపించింది. మండల పరిషత్ కార్యాలయం ఆవరణ, జనావాసాలు, లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరింది.

ఎస్.రాయవరం: మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికి సాయంత్రం ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకుని ఈదురుగాలులతో పాటు భారీ వర్షం పడింది. పెగుమ్మలూరు శివాలయం, తిమ్మాపురం, రేవుపోలవరం వైపు ఆర్అండ్‌బీ రోడ్డుపై పెద్ద ఎత్తున వర్షం నీరు పారింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే క్రమంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

అచ్యుతాపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తంతడి, మడుతూరు, ఎరికిరెడ్డిపాలెం, వాడపాలెం, రాజానపాలెం, అంగవానిపాలెం, దాసరిపాలెం, యాతపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

సమాన పరిహారం చెల్లించాలని వినతి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

నక్కపల్లి: ఏపీఐఐసీకి భూములిచ్చిన సాగుదార్లకు డీఫారం రైతులతో సమానంగా నష్టపరిహారం చెల్లించాలని పలువురు రైతులు కోరారు. రైతు నాయకులు ఎం అప్పలరాజు, గింజాల వెంకటరమణ ఆధ్వర్యంలో డీఎల్‌పురం రైతులు శుక్రవారం తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతి పత్రం ఇచ్చారు. డీఎల్‌పురంలో సర్వే నంబరు 85లో 200 మందికిపైగా సాగుదార్లు ఉన్నారన్నారు. ఈ భూములను ప్రభుత్వం వారు పరిశ్రమల కోసం సేకరిస్తున్నారని, సాగుదార్లకు రూ. 6.30 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామంటున్నారన్నారు. డీఫారం రైతులకు ఎకరాకు రూ.12 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించారని, సాగుదార్లకు ఇదేవిధంగా చెల్లించాలంటూ కోరారు. నష్టపరిహారంతోపాటు ఫలసాయానికి పరిహారం ఇవ్వాలన్నారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో రైతు నాయకులు రాజేష్, తదితరులు ఉన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం


సమ్మర్ క్యాంప్ పిల్లలు, క్రీడాకారులతో శ్రీవిష్ణు ఆస్పత్రి సిబ్బంది


పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు సుధీర్

అచ్యుతాపురం రూరల్: ఆరోగ్యమే మహా భాగ్యమని శ్రీవిష్ణు డెంటల్ కాస్మోటిక్స్ వైద్యుడు అడిగర్ల సుధీర్ తెలిపారు. శుక్రవారం వీఆర్ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా రగ్బీ కోచ్ వెంకట్ ఆధ్వర్యంలో శ్రీవిష్ణు డెంటల్ కాస్మోటిక్స్ సహకారంతో 60 మంది పిల్లలకు, క్రీడాకారులకు ఎత్తు, బరువు చూసి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యుడు సుధీర్ మాట్లాడుతూ నోటి దుర్వాసన రాకుండా రోజూ రెండు సార్లు బ్రష్ చేసుకోవాలన్నారు. ఏదైనా ఆహారం తీసుకున్నాక నోరు పుక్కలించుకోవాలన్నారు. తలంటూ నూనె రాసుకుని మరుసటి రోజు తల స్నానం చేయాలన్నారు. తలకు నూనె రాయడం వల్ల జుట్టు రాలే సమస్యలు ఉండవన్నారు. ప్రతి ఒక్కరూ మంచి పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మౌనిక, సత్య, బీజేపీ మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడు బాబు, కోచ్ సుబ్రహ్మణ్యం, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం


యలమంచిలిలో సీఐటీయూ జెండా ఎగురవేస్తున్న కార్మికులు



అచ్యుతాపురంలో వేడుకలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం రూరల్: కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని జిల్లా అధ్యక్షుడు రొంగలి రాము తెలిపారు. స్థానిక కూడలిలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు ఆధ్వర్యంలో యూనియన్ జెండా ఎగురవేశారు. ఆటో యూనియన్ నాయకుడు కర్రి నాయుడు, బోడమాంబిక ఆటో యూనియన్ నాయకులు రమేష్, గణేష్, ప్రకాష్, శ్రీను, హనుమంతు, ఏడుకొండలు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: సీఐటీయూ ఆవిర్భావం నుంచి కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసమే రాజీలేని పోరాటం చేస్తోందని మండల కన్వీనర్ చింతకాయల శివాజీ అభిప్రాయపడ్డారు. శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని ధర్మవరం, మర్రిబంద ఫ్యూజన్ బ్రిక్స్ ఆవరణలో యూనియన్ జెండాను మహిళలు, కార్మికుల సమక్షంలో ఎగురవేశారు. కార్యక్రమంలో శశికళ, సత్యనారాయణ, చిరంజీవి, లక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

సాగులో యాంత్రీకరణ లాభదాయకం


రైతులతో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్

రావికమతం: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్ కోరారు. యాంత్రీకరణతో వ్యవసాయం చేపట్టడం ద్వారా పని వేగం కావడంతో పాటు ఖర్చు తగ్గుతుందన్నారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో దొండపూడి, జెడ్.బెన్నవరం గ్రామాల్లో జిల్లా వ్యవసాయ శాఖల సహకారంతో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలను శాస్త్రవేత్తల ద్వారా రైతులకు అందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ భవాని మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలో వివరించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పంట మార్పిడి వల్ల ఎర్రకుళ్లు, పసుపాక తెగుళ్లను నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రూప, శాస్త్రవేత్తలు ఎస్.సత్తిబాబు, కిషోర్ కుమార్, కిరణ్‌కుమార్, వెంకటేషన్, సుగుణ, ఎం.విజేత, అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.జగదీష్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత


పాఠశాల విద్యార్థులకు యోగా నేర్పిస్తున్న ఆచార్యులు


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి


కోటవురట్లలో యోగా చేస్తున్న ఉద్యోగులు


మునగపాకలో యోగా సాధన చేస్తున్న దృశ్యం

కోటవురట్ల: యోగాతో శారీరక, మానసిక దృఢత్వాన్ని పొందవచ్చని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఈటీలు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా రక్త ప్రసరణ సక్రమంగా జరిగి ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. శరీర బరువును నియంత్రించడంతో పాటు అనారోగ్య సమస్యలను దూరం చేస్తుందన్నారు. అనంతరం యోగా శిక్షణకు వచ్చిన వారికి పోషకాహారం అందించారు. ఈవోపీఆర్డీ రఘురాం, సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో యోగా తరగతులు

నక్కపల్లి: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెదబోదిగల్లం, జానకయ్యపేట పాఠశాలల్లో విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్, తెలుగు ఉపాధ్యాయుడు ఎన్‌వీఎస్ ఆచార్యులు పలు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా ప్రాణాయామం అనేది మనిషికి ఎంతో అవసరమన్నారు. మానసిక ప్రశాంతతతోపాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. యోగాను దినచర్యగా తీసుకోవాలన్నారు. నిత్యం యోగా చేయడం వల్ల ఒత్తిడిని జయించవచ్చన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఉపమాక దేవస్థానంలో మూడు రోజుల నుంచి యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యదర్శులు, వెలుగు సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొంటున్నారు.

యోగాంధ్రపై గ్రామస్థాయిలో అవగాహన

మునగపాక: గ్రామస్థాయిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె యోగాంధ్రపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాంధ్రకు సంబంధించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. యాప్ డౌన్‌లోడ్‌పై దృష్టి సారించాలన్నారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఈవోపీఆర్డీ సోమరాజు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న యోగా శిక్షణ

మునగపాక బైపాస్ రోడ్డులోని రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ కార్యక్రమం శుక్రవారం నాల్గో రోజుకు చేరుకుంది. సచివాలయ ఉద్యోగులతోపాటు స్థానికులు యోగా తరగతులకు హాజరవుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. యోగా గురువులు యోగా చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు.

రిజిస్ట్రేషన్‌తో చిరు వ్యాపారులకు మేలు


మాడుగుల వెలుగు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్: ఉచిత ఉద్యమమ్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం ద్వారా చిరు వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. మాడుగుల వెలుగు కార్యాలయంలో శుక్రవారం వ్యాపారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పరిశ్రమల కార్యాలయం ప్రతినిధి మహేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో చిరు వ్యాపారులకు ప్రభుత్వం ఇతోధికంగా ఆర్థిక సహాయం అందించేందుకు సచివాలయ సిబ్బంది ద్వారా ఇప్పటికే సర్వే చేపట్టామన్నారు.

రెండు గంటల్లో చిన్నారి ఆచూకీ లభ్యం


చిన్నారి మానవిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి: ఆడుకుంటూ ఇంటి ప్రాంగణం నుంచి బయటకు వెళ్లిపోయిన మూడేళ్ల చిన్నారి ఆచూకీని పెందుర్తి పోలీసులు రెండు గంటల వ్యవధిలో కనిపెట్టారు. వివరాలివి.. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని దొగ్గవానిపాలేనికి చెందిన నకరాపు మానవి(3) గురువారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా.. ఇంటి ప్రాంగణంలో ఆడుకుంటోంది. అయితే కొద్దిసేపటికి మానవి కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఫలితం లేకపోవడంతో పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు కాలనీలో శోధించారు. దాదాపు రెండు గంటల తరువాత ఓ నిర్మానుష్య ప్రాంతంలో చిన్నారిని గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది.

కార్మికురాలి మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్

అనకాపల్లి టౌన్: ఎస్. రాయవరం మండలం గుడివాడ పంచాయతీ పరిధిలోని సాయి మెరన్ కంపెనీలో పనిచేస్తున్న ఒడిశా కార్మికురాలి మృతి పట్ల సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కంపెనీలో మృతి చెందిన వివరాలు యాజమాన్యం గోప్యంగా ఉంచడంతో అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి వాస్తవాలను బయట పెట్టాలన్నారు.

కె.జె.పురం జంక్షన్‌లో ఆక్రమణలపై చర్యలేవి?


మాడుగుల తహసీల్దారు రమాదేవికి ఫిర్యాదు చేస్తున్న రామకొండలరావు, తదితరులు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో ఆక్రమణలపై చర్యలేవని స్థానికులతో పాటు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు డిమాండ్ చేశారు. మార్చి 10న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు, పంచాయితీ సిబ్బంది మార్చి 19న రహదారికి ఇరువైపులా సర్వే చేసి, ఆక్రమణలను గుర్తించి మార్కింగ్ చేశారు. ఆక్రమణలు తొలగించుకోవాలని, లేకపోతే తామే తొలగిస్తామని, గత నెల, ఈ నెలల్లో నోటీసులు కూడా ఇచ్చారు. అయినా ఎటువంటి ఆక్రమణలు గానీ, పనులు జరగలేదు. మరోవైపు ఈ సమస్య పరిష్కరించకుండా స్పందనలో వచ్చిన అర్జీని పూర్తిగా క్లోజ్ చేశారని సమాచార హక్కు చట్టం ప్రకారం శుక్రవారం తహసీల్దారు రమాదేవికి రామకొండలరావు, తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై మళ్లీ ఫిర్యాదు చేస్తామని, లేకపోతే ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు.